జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## వరంగల్

ములుగు - మహబూబాబాద్

జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ

శుక్రవారం | 17 | ఏప్రిల్ | 2026 • పేజీలు : 9



## మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి వేగంగా అడుగులు

- ఎయిర్పోర్ట్ అథారిటీ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం



**వరంగల్, ఏప్రిల్ 16 (ప్రజాజ్యోతి):** మామునూర్ ఎయిర్ పోర్ట్ పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు వేగం తీసుకురావడానికి ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏ ఏ ఐ) అధికారులు గురువారం వరంగల్ లోని మామునూర్ ఎయిర్ పోర్ట్ ను సందర్శించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ చాంబర్లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఏఐ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సౌత్ రీజన్) ఎం. రాజా కిషోర్, హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మిగతా 2 లో...



## సంక్షేమ అభివృద్ధి పథకాలపై అవగాహనకు మండల స్థాయి సమావేశాలు

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలి
- రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామాలలో రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలి
- వచ్చే ఏడాది నాటికి సంపూర్ణ క్షయ రహిత జిల్లాగా చేద్దాం
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ఎల్కతుర్తి ఏప్రిల్ 16 (ప్రజాజ్యోతి) :** ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడానికి గ్రామ మండల స్థాయి సమావేశాలను నిర్వహిస్తున్నామని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎస్ ఎం ఆర్ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ పథకాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులు మహిళలకు అందిస్తున్న సేవలపై జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ వివరించారు. ఇతర శాఖల అధికారులు తమ తమ మిగతా 2 లో...



## సమర్థవంతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు

- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం
- దివ్యాంగులకు మోటరైజ్డ్ వాహనాలు
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర

**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పథకాలను సమర్దవంతంగా అమలు చేస్తున్నామని,పదవ తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తుందని, దివ్యాంగుల విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాలు అందించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర తెలిపారు.99 రోజుల 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా గురువారం మల్లంపల్లి మండల కేంద్రం లోని రైతువేదికలో నిర్వహించిన 'మండల సభ' కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు,పథకాల ప్రయోజనాల గురించి లబ్ధిదారులు స్వయంగా వారి మాటలలోనే అందరికీ తెలియజేయడం జరిగిందని అన్నారు.ప్రభుత్వం విద్య, సామాజిక భద్రత,మహిళల ఆర్థిక అభివృద్ధి వంటి అంశాలకు అధిక ప్రాధాన్యత మిగతా 2 లో...

## పెద్ద ఆస్పత్రిలో... ఫార్మసిస్టుల కొరత

- రోగులకు తప్పని తిప్పలు




**ఏటూరునాగారం ఏప్రిల్ 16 ప్రజాజ్యోతి** మండల కేంద్రంలోని 100 పడకల పెద్ద ఆస్పత్రి సామాజిక వైద్యశాలలో ఫార్మసిస్టుల కొరత తీవ్రంగా ఉందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఆసుపత్రి అయినప్పటికీ ప్రస్తుతం మిగతా 2 లో...



## అడవిలో అక్రమంగా మట్టి తవ్వకాలు

- డోలోమైట్ రాయి వంటి విలువైన ఖనిజ సంపద మాయం
- వన్యప్రాణులకు ముప్పు
- పర్యావరణానికి ప్రమాదం

**ఖానాపురం / ఏప్రిల్: 16 (ప్రజాజ్యోతి)** వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట శివారు టేకుల తండా సమీపంలోని పోచారం అటవీ ప్రాంతంలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి కొందరు " మట్టి దందా " సాగిస్తున్నారు. అధికారుల అండదండలతో కొందరు మట్టి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా తమ మట్టి దందాను సాగిస్తున్నట్లుగా సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీ ప్రాంతంలో యంత్రాల సహాయంతో రాత్రి వేళల్లో ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు మిగతా 2 లో...

## మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి వేగంగా అడుగులు

(మొదటి పేజీ తరువాయి...)

డైరెక్టర్/జీఎం (సిఐసి) అచింత కుమార్ దత్తా, ఏజీఎం (ఇంజినీరింగ్–సివిల్) అండ్ ల్యాండ్ మేనేజ్ మెంట్ అధికారి జి. నటరాజు తదితరులు పాల్గొన్నారు. అధికారులు తమ సందర్శనలో గమనించిన అంశాలను సమావేశంలో వివరించారు. మామునూర్ ఎయిర్ పోర్ట్ పునరుద్ధరణపై సమగ్రంగా చర్చిస్తూ రన్ వే పరిస్థితి, టెర్మినల్ సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు వంటి కీలక అంశాలను సమీక్షించారు. ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి అవసరమైన మెరుగుదలలు, మౌలిక సదుపాయాల విస్తరణపై అధికారులు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధి చెందితే ప్రాంతీయ రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పరిశ్రమలు, పర్యాటక రంగాలకు కూడా గణనీయమైన ప్రోత్సాహం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, ఆర్డీవో వరంగల్ సుమ, ఏడి సర్వే ల్యాండ్ శ్రీనివాస్, ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, సంబంధిత శాఖల అధికారులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

## పెద్ద ఆస్పత్రిలో ఫార్మసిస్టుల కొరత



(మొదటి పేజీ తరువాయి...)

ఒక్క ఫార్మసిస్ట్ మాత్రమే పనిచేస్తుండడంతో మందుల పంపిణీలో ఆలస్యం జరుగుతూ, రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆసుపత్రి అవసరాలకు కనీసం నలుగురు ఫార్మసిస్టులు అవసరమున్నప్పటికీ, సిబ్బంది లోపం వల్ల సేవలు సక్రమంగా అందడం లేదని సమాచారం. ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో రోగులు రావడంతో ఉన్న ఒక్క ఫార్మసిస్ట్ పై పనిభారం అధికమైందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, పూర్తి స్థాయిలో వైద్యులు అందుబాటులో లేకపోవడం మరో సమస్యగా మారింది. పట్టణ ప్రాంతాల నుంచి వైద్యులు వంతుల వారీగా అప్ అండ్ డౌన్ విధులు నిర్వహించడం వల్ల అత్యవసర సమయాల్లో చికిత్స అందడంలో అంతరాయం ఏర్పడుతోందని రోగులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులు ముఖ్యంగా ఇబ్బందులు పడుతున్నారని, మందులు సమయానికి అందకపోవడంతో ఆరోగ్య సమస్యలు మరింత పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అదనంగా ఫార్మసిస్టులను నియమించడంతో పాటు, పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

## అడవిలో అక్రమంగా మట్టి తవ్వకాలు

(మొదటి పేజీ తరువాయి...)

జరుగుతున్నప్పటికి సంబంధిత అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. అక్రమంగా మట్టి దోపిడీకే పరిమితం కాకుండా మట్టి దందా వల్ల పర్యావరణానికి ప్రమాదం పొంచి ఉందని, వన్యప్రాణులకు తీవ్రమైన ప్రాణముప్పును కలిగిస్తున్నాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరించాల్సిన ప్రాంతాలలో ఈ యంత్రాల శబ్దం వాటి జీవనస్థితిగతుల భయభ్రాంతులకు గురిచేస్తోంది. దీంతో వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని పలువురు అందోళన వెలిబుచ్చుతున్నారు. ఒకవైపు పాకాల అభయారణ్యంలో వన్యప్రాణుల మనుగడ కోసం అధికారులు అనేక చర్యలు చేపడుతుంటే, మరోవైపు కొందరు అక్రమార్కులు సాగిస్తున్న ఈ మట్టి తవ్వకాల వల్ల లక్ష్యానికి గండి పడుతోంది.మట్టి తవ్వకాల కోసం అటవీ ప్రాంతంలో అడ్డు వచ్చిన విలువైన చెట్లను తొలగిస్తూ, మట్టిలో అపారమైన డోలోమైట్ రాయి వంటి విలువైన ఖనిజ సంపదను అక్రమంగా తరలిస్తూ సంపదను పోగేసుకుంటున్నారు. ఈ చర్యలు అడవిలోని సహజ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. యంత్రాల శబ్దాలకు అడవిలో ఉండాల్సిన వన్యప్రాణులు జనావాసాల వైపు వస్తున్నాయని, దీంతో అవి వేటకు గురయ్యే, భవిష్యత్తులో కొన్ని ప్రాణులు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు ఈ అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పాకాల అటవీ ప్రాంతాన్ని కాపాడాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలు కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితం కాకుండా మొత్తం పర్యావరణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తక్షణమే ఈ అక్రమ మట్టి దందాను అరికట్టి, అటవీ సంపదను, వన్యప్రాణులను రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# సంక్షేమ అభివృద్ధి పథకాలపై అవగాహనకు మండల స్థాయి సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి...)



విభాగాలకు సంబంధించిన కార్యక్రమాలను వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను సామర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని ఇందిరమ్మ లబ్ధిదారులకు నిర్మాణ దశల ప్రకారం ప్రతి వారం బిల్లులు సమయానికి చెల్లిస్తున్నామని చెప్పారు. ఎక్కడ బిల్లులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లి ఇందిరానగర్ గుంటూరుపల్లి గ్రామాలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో 100% ప్రగతి సాధించాయని అభినందించారు. మిగతా గ్రామాలు కూడా అదేవిధంగా ముందుకు సాగాలని సూచించారు. బ్యాంకు లీకేజీ ద్వారా రుణాలు అందించి ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న చిన్న సమస్యలను సర్పంచులు పరిష్కరించాలని పంచాయతీల ద్వారా సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో 100% విద్యుత్తు సౌకర్యం కల్పించాలని అవసరమైతే ఖాళీ గదులు ఉన్న పాఠశాలలకు తరలించాలని అన్నారు. విలేజ్ న్యూట్రిషన్ డే సందర్భంగా గర్భిణీలు, చిన్నారులు రక్తహీనత సమస్యలు పోషకాహార లోపం వంటి అంశాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా ఏఎన్ఎం సిబ్బంది కృషితో జిల్లాలో టీబీ కేసులు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ఎల్కతుర్తినీ టిబి రహిత మండలంలో కొనసాగిస్తూ వచ్చే సంవత్సరం జిల్లాను టీబి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం అరైవు అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు గ్రామాల్లో రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించాలని అన్నారు. గంజాయి వ్యాప్తి గ్రామాల వరకు చేరిందని ఆందోళన వ్యక్తం చేస్తూ సమిష్టిగా దాన్ని నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. యువత భవిష్యత్తులో దృష్టిలో ఉంచుకొని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరిగితే వెంటనే నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశం అనంతరం అంగన్వాడి కేంద్రాలకు చెందిన చిన్నారులకు దుస్తులను కలెక్టర్ పంపిణీ చేశారు. అంగన్వాడి టీచర్లు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజి, సర్పంచ్ మునిగడప లావణ్య, జడ్పీ సీఈవో శేషాద్రి, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, డిపిఓ లక్ష్మి , రమాకాంత్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, గృహ నిర్మాణ శాఖ పిడి సిద్ధార్థ నాయక్, డీఈవో గిరిరాజ్ గౌడ్, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, ఏడిఏ ఆదిరెడ్డి, ఎంపీడీవో ఎన్. విజయ్ కుమార్, తహసిల్దార్ ప్రసాద్ రావు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు

(మొదటి పేజీ తరువాయి...)



ఇస్తూ మరిన్ని నూతన సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడుతుందని స్పష్టం చేశారు.గతంలో కేవలం హై స్కూల్ పదవ తరగతి విద్యార్థులకే మధ్యాహ్న భోజన పథకం అమలు చేసే వారని,ఇప్పుడు ఇంటర్ విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు.హైస్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు,ఉదయం పూట అల్పాహారం కూడా అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు.దివ్యాంగులకు చేయూతను అందించాలనే లక్ష్యంతో ఇంటర్మీడియట్ చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు,వారి సౌకర్యార్థం మోటరైజ్డ్ వాహనాలను అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' అనే నూతన పథకాన్ని ప్రవేశపెడుతుందని వెల్లడించారు.రైతులు కేవలం వరిపైనే ఆధారపడకుండా,తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే ఇతర పంటల సాగు వైపు దృష్టి సారించాలని, దీనివల్ల ఎరువుల వినియోగం తగ్గి భూసారం పెరుగుతుందని వివరించారు.ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, రైతులు కూడా దీనిపై అవగాహన పెంచుకోవాలని కోరారు.ఆయిల్ పామ్ సాగు చేయడం ద్వారా ఎకరానికి 40 వేల రూపాయల సబ్సిడీ అందిస్తుందని, ఒక్కసారి సాగు చేస్తే మొదటి దిగుబడి నుంచి 30 సంవత్సరాల వరకు స్థిరంగా, నికరంగా ఆదాయం వస్తుందని తెలిపారు.ఆయిల్ పామ్ మొక్కల మధ్య ఖాళీస్థలంలో అంతర పంటలుగా పప్పు దినుసులను కూడా సేద్యం చేసుకోవచ్చని, దానికి కూడా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని వివరించారు. ఇంచర్ల గ్రామ శివారులో ఎర్రి గట్టమ్మ వద్ద పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ దశలో ఉందని,దీని ద్వారా 300 మందికి ఉపాధి అవకాశాలు కలగడంతో పాటు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ సేద్యం చేసిన రైతులు స్థానికంగానే తమ పంటను విక్రయించుకోవచ్చు అని పేర్కొన్నారు.నూతన పథకాల ద్వారా విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు,సామాజికంగా వెనుకబడిన వర్గాలకు భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు. మల్లంపల్లి మండలంలో నూతన మార్కెట్ యార్డ్, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం,పలు అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డీఓ కృపాకర్,ఆత్మ కమిటి చైర్మన్ రవీందర్ రెడ్డి, ఎంపీఓ, తహశీల్దార్, మండల స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

**కొడకండ్ల, ఏప్రిల్ 16 (ప్రజాజ్యోతి):** ద్విచక్ర వాహనదారుడిని వెనుక నుండి అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన కొడకండ్ల మండలంలోని రామవరం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్.ఐ చింతా రాజు తెలిపిన వివరాల ప్రకారం గురువారం మధ్యాహ్నం 11 గంటల 30 నిమిషాలకు రామవరం గ్రామానికి చెందిన కర్నూరి మనోహర్ రెడ్డి (65), అను వ్యక్తి రామవరం గ్రామ శివారు లోని తన పొలం వద్ద పొలం పనులు ముగించుకుని రామవరం గ్రామం వైపు ద్విచక్రవాహనమైన యాక్టివా స్కూటీ పై వస్తుండగా వెనకాల నుండి ఇటుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ అతివేగంగా అజాగ్రత్తగా వచ్చి స్కూటీని ఢీకొనడంతో వెంటనే స్కూటీ మీద ప్రయాణిస్తున్న మనోహర్ రెడ్డి కింద పడగా అతని పైనుండి ట్రాక్టర్ టైర్ వెళ్లడంతో చాతికి, తలకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై రాజు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చింతా రాజు తెలిపారు. ఈ ఘటనతో రామవరం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



# చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్కు పరిశీలన







- **పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

హనుమకొండ ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి)

హనుమకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం పరిశీలించారు.చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ లో ట్రాఫిక్ కూడళ్ళు, సిగ్నల్స్, యూటర్న్, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, పాఠశాలల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్మించడాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ గురించిన వివరాలను కలెక్టర్ కు ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ సురేష్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారులు వేణుగోపాల్, రమేష్ రాథోడ్, కిషోర్ బాబు, హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ సుభద్ర కుటుంబాన్ని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్



**పరకాల, ఏప్రిల్ 16, (ప్రజా జ్యోతి ):**పట్టణంలోని 17వ వార్డు కౌన్సిలర్ బొచ్చు సుభద్ర సాల్మన్ తల్లి కుమ్మరి ఎల్లమ్మ ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ మాదన్నపేట గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారితోపాటు వైస్ చైర్మన్ ఏకు దివ్య విద్యాసాగర్, కౌన్సిలర్లు పొరండ్ల మౌనిక వేణు, గొడుగు రజిత నాగరాజు, పసుల లావణ్య రమేష్, గూడెల్లి సదన్న, ఆకుల లావణ్య శ్రీధర్, కుక్కల విజయ్, కొయ్యడ శ్రీనివాస్, పాలకుర్తి శ్రీనివాస్, సుధమల్ల రమేష్, అల్లే దశరథం, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు చేరువలో ప్రభుత్వ పథకాలు

- **99 రోజుల కార్యాచరణ ప్రారంభం**
- **గ్రామాల సమగ్ర అభివృద్ధికి కలెక్టర్ డా. సత్య శారద పిలుపు**





**గీసుకొండ, ఏప్రిల్ 16(ప్రజాజ్యోతి):**ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణకు గీసుకొండ మండలంలో శ్రీకారం చుట్టారు. గురువారం కోనాయిమాకుల రైతు వేదికలో మండల స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరై "జయ జయ హే తెలంగాణ" రాష్ట్ర గీతంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో పది కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల త్వరిత పరిష్కారం, ఆరోగ్యం, "అరైవ్ అలైవ్" ద్వారా సురక్షిత ప్రయాణం, సంక్షేమ పథకాలు, పిల్లల సంరక్షణ, డ్రగ్ నియంత్రణ, వ్యవసాయం, విద్య, యువత–క్రీడలు, మహిళా సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై సమగ్ర అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని, నిరంతర పర్యవేక్షణతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉందని, సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 18004253424 ద్వారా ఫిర్యాదులు నమోదు చేయవచ్చని తెలిపారు. ఈ ఫిర్యాదులను సంబంధిత ఆసుపత్రుల్లో వాయిస్ రికార్డింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజాపాలన కార్యక్రమాల ద్వారా ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు శాఖల మధ్య సమన్వయం అవసరమని ఆదేశించారు. ఈ సమావేశంలో గీసుగొండ తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీవో కృష్ణవేణి, 21 గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఫైర్ సేఫ్టీ పై అవగాహన కలిగి ఉండాలి



**ఏటూరునాగారం ఏప్రిల్ 16 ప్రజా జ్యోతి** మండల కేంద్రంలోని వాటర్ ప్లాంట్ రోడ్ వద్ద అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ సిబ్బంది ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యక్ష డెమో నిర్వహించి వివరించారు.గ్యాస్ లీకేజీ జరిగితే ఎలా గుర్తించాలి, అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు వెంటనే తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి వంటి అంశాలను ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించారు. ఫైర్ సేఫ్టీ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సంప్రదించాల్సిన ఫైర్ సర్వీస్ టోల్ ఫ్రీ నంబర్ 101 అని, అలాగే స్థానిక ఫైర్ స్టేషన్ నంబర్ 8712685772 అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పి. శ్రీనివాస్, కృష్ణకాంత్ , ఆర్. అనిల్ పి. మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## చల్లాను ఆహ్వానించిన హిందూ ధర్మ సమ్మేళనం



**హనుమకొండ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 16, (ప్రజా జ్యోతి ):** పరకాల పట్టణంలో ఈ నెల 28న నిర్వహించనున్న హిందూ ధర్మ సమ్మేళనానికి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని సమితి సభ్యులు ఆహ్వానించారు. గురువారం హనుమకొండలోని ఆయన నివాసంలో కలిసిన పరకాల పట్టణ హిందూ ధర్మ సమ్మేళన సమితి ప్రతినిధులు, పశువుల సంతలో జరగనున్న ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ సమ్మేళన సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు కంటి చూపు సరిగా ఉండటం ఎంతో ముఖ్యం

- **పసర గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి పరీక్షా శిబిరం**

**గోవిందరావుపేట (పస్రా)/ములుగు ప్రజా జ్యోతి** ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ కేకన్ ఆదేశాలమేరకు డీఎస్పీ కిషోర్ సూచనల మేరకు పసర ci దయాకర్ పర్యవేక్షణలో పసర ఎస్ ఐ తాజుద్దీన్ ఆధ్వర్యంలో పసర గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ఆటో డ్రైవర్లు మరియు వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరంలో సుమారు 150 మంది పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు పాల్గొన్న వారికి కంటి ఆరోగ్యంపై సూచనలు అందించడంతో పాటు, అవసరమైన వారికి మందులు మరియు చికిత్సపై మార్గదర్శనం చేశారు.ప్రజల్లో కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా వాహనదారులు కంటి చూపు సరిగా ఉండటం ఎంత ముఖ్యమో వివరించారు.ఈ కార్యక్రమంలో 2వ ఎస్ ఐ ఆంజనేయులు స్థానిక ప్రజలు, ఆటో డ్రైవర్లు మరియు ఇతరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల స్థాయి సమావేశం



**ధర్మసాగర్, ఏప్రిల్ 16 (ప్రజాజ్యోతి):**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా MPDO, MRO, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, పోలీస్ అధికారులు హాజరై గ్రామాల్లో జరుగుతున్న పనుల పురోగతి, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై చర్చించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.అదేవిధంగా గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి, పనులను వేగవంతం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజల సేవలో నిరంతరం కృషి చేస్తున్న ఖలీల్

- ఘన సన్మానం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ఏటూరు నాగారం ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండి ఖలీల్ ఖాన్ జిల్లా కార్యదర్శిగా ఎన్నిక కావడంతో గురువారం ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. షాపెల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు కుక్కల రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా కార్యదర్శిగా నియమితులైన ఎండి ఖలీల్ ఖాన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ, ఖలీల్ ఖాన్ నియామకం పార్టీకి మరింత బలం చేకూర్చుతుందని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభా వం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎండి ఖలీల్ ఖాన్ మాట్లాడుతూ, పార్టీ తన పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజల సేవలో నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు చిటమట రఘు, చంటి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

## ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక మండల స్థాయి సమావేశం



**వెంకటాపురం,ఏప్రిల్ 16 (ప్రజాజ్యోతి ):** ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలయ్యే లా చూస్తామని అధికారులు అన్నారు.గురువారం ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని పాత్రాపురం రైతు వేదిక వద్ద మండల ప్రత్యేక అధికారి సంజీవ రావు అధ్యక్షతన 99 రోజుల ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక పై మండల స్థాయి సమావేశం నిర్వహించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.శాఖల వారీగా పథకాల వివరాలు తెలియజేసి వాటి అమలపై చర్చించారు.అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి పలు తీర్మానాలు ఆమోదించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వేణు గోపాల్,ఎంపీడీవో జిమ్మిలాల్,ఎంఈఓ సత్యనారాయణ,పోలీస్ విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్,ఇరిగేషన్,ఆర్ అండ్ బి,ఏపీఎం,ఏపీవో,సిడిపిఓ అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు,సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,వార్డు సభ్యులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ పవిత్రన్ మాతృమూర్తి కి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ నివాళులు



**నర్సంపేట ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి )** నర్సంపేట పట్టణ వాస్తవ్యులు వడ్లకొండ పవిత్రన్ గౌడ్,నివిత్రన్ గౌడ్ ల మాతృమూర్తి కీ"శే" ప్రేమనిల హార్ట్ స్ట్రోక్ తో మృతి చెందగా క్రీ"శే" వడ్లకొండ ప్రేమనిల పార్థివ దేహానికి పూలమాలవేసి గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ నివాళులు అర్పించారు.కుటుంబసభ్యులను పరామర్శించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఉగ్గిడి శివుడు,అబ్బు వెంకట్ రెడ్డి,కారుపోతుల విజయకుమార్ గౌడ్,తాళ్లపెల్లి చంద్రమౌళి గౌడ్,ఊడ్గుల శ్రీనివాస్ గౌడ్ రడం శ్రీనివాస్ గౌడ్,కుండే సురేష్, వడ్లకొండ రాజు గౌడ్,మహాదేవుని,నరేష్,రవి తేజ,గట్టు అ మర్,తోటకూరి సదా నందం,శ్రీనివాస్,రాంబాబు, నల్ల మనోహర్ రెడ్డి,నాగేల్లి వెంకట నారాయణ,కౌన్సిలర్స్ బత్తిని రాజేందర్,వేముల సాంబయ్యగౌడ్ పాల్గొన్నారు.

# 'సుగుణ పేపర్ ప్లేట్స్' పై టాస్క్‌ఫోర్స్ మెరుపు దాడులు

- ప్లాస్టిక్ నిబంధనలు ఉల్లంఘనపై కఠిన చర్యలు
- రూ.3 లక్షల స్టాక్ స్వాధీనం, యజమానికి జరిమానా



**వరంగల్ సిటీ, ఏప్రిల్ 16(ప్రజా జ్యోతి):** పర్యావరణానికి హానికరమైన నిషేధిత ప్లాస్టిక్ కవర్ కోటెడ్ పేపర్ ప్లేట్ల తయారీపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ కొరడా ఝుళిపించింది. గురువారం నగరంలోని తిమ్మాపూర్ శివారు పెన్షన్‌పూర్ లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న 'సుగుణ పేపర్ ప్లేట్స్' యూనిట్‌పై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా సుమారు రూ.3 లక్షల విలువ గల నిషేధిత ప్లాస్టిక్ పేపర్ ప్లేట్స్‌తో పాటు ముడి సరుకును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తక్కువ మైక్రాన్ ప్లాస్టిక్‌తో తయారు చేస్తున్న ఈ ఉత్పత్తులు పర్యావరణానికి తీవ్ర హానికరమని గుర్తించారు. పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ జి. బాబులాల్ బృందం ఈ దాడులు చేపట్టింది. యూనిట్‌ను నిర్వహిస్తున్న సంగ సంజీవ్ అలియాస్ సంజీవయ్య (66) పై కేసు నమోదు చేశారు. ఇక గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం అధికారులు సదరు యజమానికి రూ.13,000ల జరిమానా విధించి యూనిట్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ దాడుల్లో బల్దియా అధికారులు మధుసూదన్ రెడ్డి, ప్రశాంత్, శ్రీధర్ పాల్గొన్నారు.

››› నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు..

ప్లాస్టిక్ నియంత్రణ చట్టాలు, పర్యావరణ పరిరక్షణ నిబంధనలు పాటించని వ్యాపారులపై నిరంతర నిఘా కొనసాగుతుందని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఈ దాడిలో ఏఎస్ఐ కె. సుధాకర్, కానిస్టేబుళ్లు మహమ్మద్ గౌస్ పాషా, అంజయ్య, శ్యామ్‌సుందర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి



**గోవిందరపేట( పస్రా. )/ములుగు ఏప్రిల్ 16 ప్రజా జ్యోతి :** ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ కేకన్ ఆదేశాల మేరకు, డీఎస్పీ కిషోర్ సూచనలతో, సీఐ దయాకర్ పర్యవేక్షణలో పసర ఎస్ ఐ తాజుద్దీన్ ఆధ్వర్యంలో గురువారం రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలు పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అతివేగం ప్రాణాంతకమని తెలియజేశారు. అలాగే ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు.ఈ సదస్సులో 2వ ఎస్ ఐ ఆంజనేయులు పోలీస్ సిబ్బంది, స్థానికులు పలువురు పాల్గొన్నారు.

## ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం

- మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ఏటూరునాగారం ఏప్రిల్ 16 ప్రజా జ్యోతి** మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ కార్యాలయాన్ని ప్రజల సేవ కోసం వినియోగిస్తామని తెలిపారు. కార్యకర్తలు, సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ఏటూరునాగారం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి సమస్యపై స్పందిస్తూ ప్రజలకు చేరువగా ఉంటామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే వినతులను అధికారులకు తెలియజేసి, త్వరితగతిన పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు.అలాగే ప్రజా ప్రతినిధులు కూడా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా సేవలు అందించడం ప్రతి నాయకుడి బాధ్యత అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సురక్షిత ప్రయాణానికి కంటి చూపు ప్రధానం

- : జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16 (ప్రజాజ్యోతి) :** సురక్షిత ప్రయాణానికి కంటి చూపు ప్రధానమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా నిర్వహిస్తున్న అరైవ్ – అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో గల గ్రేయిన్ మార్కెట్ పరిధిలో యార్డు డ్రైవర్ లకు, అలాగే అన్ని రకాల వాహనాల డ్రైవర్ లకు కంటి పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, రవాణా శాఖ సమన్వయంతో ఈ అరైవ్ – అలైవ్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున విజయవంతంగా కొనసాగుతూ, మంచిగా నిర్వహిస్తున్నారని అభినందించారు. జిల్లాలో రెండు నేషనల్ హైవేలు ఉన్నందున వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని, వయసు పెరిగే కొద్దీ వచ్చే కంటి సమస్యలను గుర్తించి, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి చూపు బాగా ఉంటేనే సురక్షిత ప్రయాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగా, సురక్షితంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అలాగే వాహనదారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు బయటకు వెళ్లిన తర్వాత సురక్షితంగా ఇంటికి చేరుకోవడం అత్యంత ముఖ్యమని తెలిపారు. హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ధరించడం తప్పనిసరి అని, మద్యం సేవించి వాహనం నడపకూడదని హెచ్చరించారు. లైసెన్స్ ఉన్నవారే వాహనం నడపాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, జైలు శిక్షలు కూడా విధించడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన పెంచుతున్నామని చెప్పారు. ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలతో పాటు కంటి పరీక్ష శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, కంటి చూపు ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత ముఖ్యమని, ముఖ్యంగా వాహనదారులు ప్రతి 6 నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారు కచ్చితంగా కళ్లజోళ్లు ఉపయోగించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్వయం గా డ్రైవర్ లకు అక్షరాలను గుర్తించడం లో ఉన్న కంటి సామర్థ్యన్ని పరిశీలించారు ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి మల్లిఖార్జున రావు, స్థానిక సిఐ రెడ్డి, కౌన్సిలర్ రజని, పెద్ద సంఖ్యలో డ్రైవర్ లు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులలైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

- అదనపు కలెక్టర్ వైవి గణేష్





**నర్సంపేట ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ కమిషనర్ కాటం భాస్కర్ అధ్యక్షతన మున్సిపల్ స్థాయి సమావేశం. ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అదనపు కలెక్టర్ వై వి గణేష్,ఏసీపీ రవీందర్ రెడ్డి పాల్గొన్నారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడతున సంక్షేమ పథకాలును, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి నేరుగా చేర్చడమే లక్ష్యంగా ప్రజల వద్దకే పాలన తీసుకువెళ్లే విధంగా ప్రణాళికను రూపొందించడం జరిగింది..ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రవేశపెట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అధికారులు,ప్రజా ప్రతినిధులు,ప్రజలు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.మున్సిపల్ కార్యాలయాల్లో ఏళ్ళ తరబడి పెండింగ్లో ఉన్న ఫైళ్లను వెంటనే పరిష్కరించి,ప్రజలకు సత్వర సేవలు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అధికారులు ప్రజా ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవాలని తెలిపారు.కార్యక్రమాల అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ను ఉపయోగిస్తున్నామని,అధికారుల పనితీరును నిశితంగా గమనిస్తామని వారు అన్నారు.పట్టణంలో పారిశుధ్య పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి,చెత్త సేకరణ మురుగు కాల్వల శుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని శానిటైజేషన్ అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతునం అని,పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నాం అని అన్నారు.వేసవికాలం దృష్ట్యా వార్డుల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని, నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసుకుంటామని అన్నారు.ప్రభుత్వ సంక్షేమ మరియు అభివృద్ధి పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ఎటువంటి వివక్ష లేకుండా,పారదర్శకంగా అందించడమే తమ లక్ష్యం అని తెలిపారు.కౌన్సిలర్లు, అధికారులు పట్టణ ప్రజల సహకారంతో మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని అన్నారు. అనంతరం అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఏసీపీ రవీందర్ రెడ్డి రహదారి భద్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రజా ప్రతినిధులను,అధికారులకు కోరారు.రోడ్డు ప్రమాదాల నివారణకై రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తామని, సురక్షిత ప్రయాణం చేస్తామని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ ముష్కే శ్రీనివాస్,ఎస్సై గూడ అరుణ్ కుమార్,మున్సిపల్ కౌన్సిలర్స్ బత్తిని రాజేందర్,మాదాసి రవి,ముత్తినేని వెంకన్న,ఎలకంటి విజయ్, హన్మకొండ శ్రీధర్,శివరాత్రి స్వామి,ఏపూరి శ్రీనివాస్ రెడ్డి,బాణాల ప్రసన్న,పొన్నాల మనిషా,వేముల సంధ్య,కొంపల్లి వీణ,దొంగల రజిత,శ్రీరామోజు రోజా రాణి,కొత్తకొండ మేఘన,ఇస్లావత్ రామ,ములకల వినోద,జూలూరి రోజా రాణి,మండల శ్రీదేవి,దోమ్మటి రమ్య,బూస శిరీష,మున్సిపల్ శాఖ,పోలీస్ శాఖ అధికారిలు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలు వెలకట్టలేనివి

- లక్ష్మణ్ బాబు



**ఏటూరునాగారం ఏప్రిల్ 16 ప్రజా జ్యోతి** తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలు వెలకట్టలేనివి బి ఆర్ ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు అన్నారు. మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏటూరునాగారం మండల ఉద్యమకారుల అధ్యక్షునిగా ఎన్నికైన సప్పిడి రామ్ నర్సయ్యతో పాటు నూతన కమిటీ సభ్యులను లక్ష్మణ్ బాబు ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 2001 నుండి స్వరాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ ఉద్యమంలో పోరాటం చేసిన ప్రతి యోధుడి త్యాగం అమూల్యమని పేర్కొన్నారు. లాఠీ దెబ్బలు తిని, అక్రమ కేసులు ఎదుర్కొని, జైలు జీవితం గడిపిన ఉద్యమకారుల త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. వారికి ఎలాంటి సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.సన్మాన గ్రహీత సప్పిడి రామ్ నర్సయ్య మాట్లాడుతూ, మండలంలో నిరాదరణకు గురైన ఉద్యమకారులను ఒక తాటిపైకి తీసుకువచ్చి వారి హక్కుల సాధన కోసం కృషి చేస్తానన్నారు. 2001 నుండి నమోదైన కేసులు ఇప్పటికీ వేధిస్తున్నాయని, వాటి నుండి విముక్తి కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఆర్థికంగా నష్టపోయిన ఉద్యమకారులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు.ములుగు జిల్లా ఉద్యమ సలహా గౌరవ అధ్యక్షుడు సయ్యద్ సర్దార్ పాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మలిదశ ఉద్యమకారుడు పొరిక గోవింద నాయక్, మాజీ ప్యాక్స్ చైర్మన్ కూనూరు అశోక్ గౌడ్, కాకులమర్రి ప్రదీప్ రావు, పోతరాజు కుమారస్వామి, దడిగల సమ్మయ్య, వావిలాల ముత్తయ్య, మాధరి చంద్రమౌళి, ఈసం స్వరూప, మందపల్లి చంద్రం, మహేష్ తదితరులు పాల్గొన్నారు. 2001 నాటి ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన కమిటీపై ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు



**వరంగల్ సిటీ, ఏప్రిల్ 16(ప్రజాజ్యోతి ):** నగరంలోని ఉర్సు గుట్ట బైపాస్ రోడ్ లో గల ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియపై వచ్చిన కొన్ని ఫిర్యాదుల నేపథ్యంలో సాధారణ పర్యవేక్షణలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. డి.ఎస్.పి మల్లయ్య నేతృత్వంలో సుమారు నాలుగు గంటలకు పైగా కొనసాగిన ఈ తనిఖీల్లో, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన పత్రాలను అధికారులు పరిశీలించారు. ఇన్చార్జ్ సబ్ రిజిస్టర్ వెంకట్ లాల్ అధికారులు అడిగిన డాక్యుమెంట్లను అందజేశారు. అనుమానాస్పదంగా భావించిన 12 డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని, వాటిపై వివరణాత్మకంగా పరిశీలన చేపడుతున్నట్లు సమాచారం. అయితే కార్యాలయంలోని సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తిస్తున్నారని విజిలెన్స్ అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, అవసరమైన చోట మరింత జాగ్రత్తలు తీసుకోవాలని మాత్రమే సూచనలు ఇచ్చినట్లు సమాచారం. మొత్తం మీద ఇది సాధారణ తనిఖీలలో భాగమేనని, కార్యాలయ కార్యకలాపాలు సజావుగా కొనసాగుతున్నాయని అధికార వర్గాలు స్పష్టం చేశాయి.

## గుర్తుతెలియని వాహనము ఢీకొనీ వ్యక్తి మృతి

**రాయపర్తి ఏప్రిల్ 16 ప్రజా జ్యోతి** గుర్తు తెలియని వాహనం ఢీకొని పర్వతగిరి మండలం రావూరు గ్రామానికి చెందిన దామెర శ్రీనివాస్(34) మృతి చెందాడు. మృతుడు గత నాలుగు సంవత్సరాల నుంచి కొత్తూరు గ్రామంలోని మీ సేవ కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్నాడు. రోజు లాగానే బుధవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా కొత్తూరు శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య స్వర్ణలత ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేందర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పూర్ణచందర్ దంపతులను ఘనంగా సన్మానించిన తోటి వ్యాపారులు

**వెంకటాపురం,ఏప్రిల్ 16 (ప్రజాజ్యోతి) :** ములుగు జిల్లా వెంకటాపురం మండలం కేంద్రంలోని ఎన్టీఆర్ సెంటర్లో సత్యదేవ మెడికల్ షాపు నిర్వహిస్తున్న బచ్చు పూర్ణచందర్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ములుగు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించినందుకు ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర కమిటీ స్టేట్ జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఏప్రిల్ 5 న రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలను స్వీకరించారు.మారుమూల ఏజెన్సీ ప్రాంతం నుండి మెడికల్ యూనియన్ రాష్ట్ర సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా వెంకటాపురం మండల వ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపుల యజమానులు గురువారం పూర్ణచందర్ దంపతులను వాళ్ల స్వగృహంలో పట్టు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం పూర్ణచందర్ మాట్లాడుతూ..నాతోటి మెడికల్ షాపు మిత్రుల సహకారంతో జిల్లా,రాష్ట్ర పదవులకు ఎంపికయ్యాలని మెడికల్ షాపులకు సంబంధించి స్థానికంగా ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మెడికల్ యూనియన్ సంఘం మండల అధ్యక్షులు మట్టా రామకృష్ణ, సభ్యులు అంకాల పరమేశ్వరి,టి.రాంబాబు,నరహరి,రామ్మూర్తి,వెంకట్, సురేష్, రమేష్,దాము,శ్రీను,జోగారావు,నరసింహారావు, ఆర్ఎంపీలు వంకాయల వెంకటేశ్వర్లు,సాయి తేజ,తదితరులు పాల్గొన్నారు.



## అతివేగంగా నిర్లక్ష్యం డ్రైవింగ్ ప్రమాదకరం

- ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- అరైవ్ అలైవ్ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు అవగాహన



**పస్రా /ములుగు ఏప్రిల్ 16 (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ కేకన్ ఆదేశాల మేరకు, డీఎస్పీ కిషోర్ సూచనల మేరకు,పస్ర సిఐ దయాకర్ పర్యవేక్షణలో పస్ర ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో గురువారం “అరైవ్ అలైవ్” రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు,భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు.డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ,ఫిట్ నెస్ సర్టిఫికేట్ , పొల్యూషన్ సర్టిఫికేట్ వంటి పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.అలాగే యూనిఫాం ధరించడం తప్పనిసరి అని తెలిపారు.ప్రయాణికుల భద్రత కోసం ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ చేయద్దని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్య స్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పోలీసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో 2వ. ఎస్సై ఆంజనేయులు,పోలీస్ సిబ్బంది,ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# సమాన వేతనం, సమాన హక్కులకై పోరాటం

- 9వ రోజుకు చేరిన ఆర్టిసన్ కార్మికుల ధర్నా
- ప్రాణాలకు ముప్పు, కానీ భరోసా ఎక్కడ
- పని మాది.. ప్రయోజనాలు వాళ్లవేనా
- న్యాయం, గుర్తింపు కోసం గళమెత్తిన ఆర్టిసన్ కార్మికులు





**వరంగల్ సిటీ, ఏప్రిల్ 16 (ప్రజాజ్యోతి):** విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిసన్ కార్మికులు తమకు జరుగుతున్న అన్యాయాలపై ఆవేదన వ్యక్తం చేస్తూ చేపట్టిన ధర్నా కార్యక్రమం గురువారం 9వ రోజుకు చేరింది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా ములుగు రోడ్డులోని టీజీ ట్రాన్స్ కో 220 సబ్ స్టేషన్ వద్ద ధర్నాలో కార్మికులు పలు కీలక డిమాండ్లు ముందుకు తెచ్చారు. విద్యార్హతలను పరిగణనలోకి తీసుకుని ఏపీ ఎస్ ఈ బి నిబంధనల ప్రకారం కన్వర్షన్ చేయాలని, 25 నుండి 30 సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ తగిన అవకాశాలు లేకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా పని చేస్తున్న ఆర్టిసన్‌లను అబ్సార్ప్షన్ బేసిస్‌పై రెగ్యులర్ ఉద్యోగులుగా మార్చి అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. "ఈక్వల్ వర్క్ ఈక్వల్ పే" సూత్రం అమలు చేయకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ఆర్టిసన్‌లు మరియు రెగ్యులర్ ఉద్యోగుల మధ్య వేతనాలు, సౌకర్యాల్లో తీవ్ర అసమానతలు ఉన్నాయని వారు తెలిపారు. ఆర్టిసన్‌లకు తక్కువ వేతనాలు లభిస్తుండగా, ఉద్యోగులతో పోలిస్తే గణనీయమైన వ్యత్యాసం ఉందన్నారు. ఎర్న్డ్ లీవ్స్ విషయంలో కూడా తేడా స్పష్టంగా కనిపిస్తోందని, ఆర్టిసన్‌లకు పరిమిత సెలవులు మాత్రమే ఉండగా ఉద్యోగులకు గరిష్టంగా 300 రోజుల వరకు లభిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పీ ఎఫ్ విషయంలో ఆర్టిసన్‌లకు రూ.15,000 వరకు మాత్రమే పరిమితి ఉండగా, ఉద్యోగులకు బేసిక్ మరియు డీఏ ఆధారంగా ఎలాంటి పరిమితి లేకుండా ప్రయోజనం అందుతున్నదని వివరించారు. కాంపెన్సేషన్ పరంగా ఆర్టిసన్‌లు గ్రేడ్ 4 స్థాయిలో ఉండగా, ఇతర ఉద్యోగులు మెరుగైన హోదాలు పొందుతున్నారని తెలిపారు.గ్రాట్యుటీ విషయంలో కూడా తక్కువ మొత్తాలతోనే రిటైర్ కావాల్సి వస్తోందని, సబ్‌స్టేషన్లలో ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తున్నప్పటికీ తగిన భద్రతా చర్యలు, అదనపు వేతనాలు అందడం లేదని విమర్శించారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించి సమాన హక్కులు కల్పించాలని, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న తమకు న్యాయం చేయాలని ప్రభుత్వం స్పందించాలని ఆర్టిసన్ కార్మికులు కోరుతున్నారు. ఇట్టి సమ్మె కార్యక్రమంలో రాష్ట్ర ఏఐటియుసి టిజీ ట్రాన్స్ కో స్టేట్ కన్వీనర్ వడ్డేపల్లి శ్రీనివాస్, స్టేట్ టి వి ఏ ఈ జేఏసీ కన్వీనర్ కంది కొండ వెంకటేష్, జిల్లా చైర్మన్ ఐల్లయ్య, సృజన, లక్ష్మి, కళ్యాణి, మూర్తి, ఆనంద్, కోటి, ప్రసాద్, రమేష్, రాజేష్, రాజకుమార్, జిల్లా ఆర్టిసన్స్ మోతెమ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర జాగృతి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

- జాగృతి నాయకులు బోడ అనిల్ కుమార్



**నర్సంపేట ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి)** నర్సంపేట ఏప్రిల్ 25వ తారీకు రోజున తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో నూతన రాజకీయ పార్టీగా ఆవిష్కరణ అవుతున్న సందర్భంగా వరంగల్ జిల్లా నర్సంపేట సెగ్మెంట్ పరిధిలో తెలంగాణ రాష్ట్ర జాగృతి నాయకులు డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణ ప్రాంతంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో నర్సంపేట జాగృతి నాయకులు వంశీ, మహేందర్ సురేష్ వినోద్ సంతోష్ సుదీర్ రాజేష్ యాదవ్ శ్రీకాంత్ గౌడ్ తరుణ్ లాలు బన్నీ సురేష్ నాయక్ రాఖి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిసన్ కార్మికుల సమ్మెకు బీజేపీ మద్దతు

- సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎర్రబెల్లి ప్రదీప్ రావు డిమాండ్



**వరంగల్ సిటీ, ఏప్రిల్ 16(ప్రజాజ్యోతి):** టీజీ ఎన్పిడిసిఎల్ పరిధిలో పనిచేస్తున్న ఆర్టిసన్, అన్మ్యాన్డ్, పీస్ రేట్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మెలో పాల్గొంటున్న కార్మికులకు మద్దతుగా గురువారం బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కార్మికులు అనేక సంవత్సరాలుగా అన్యాయాలకు గురవుతున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టిసన్, అన్మ్యాన్డ్, పీస్ రేట్ కార్మికులకు తగిన జీతాలు, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని, వెంటనే చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని ఆయన కోరారు. కార్మికుల హక్కుల కోసం బీజేపీ ఎప్పటికీ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖిలా వరంగల్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి అర్జున్, బీజేపీ నాయకులు బక్కీ రంజిత్, కార్తీక్, స్థానిక నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడటం వల్ల వచ్చే అనారోగ్య సమస్యల పట్ల అవగాహన సదస్సు

**నర్సంపేట ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి)** 99 రోజుల కార్యాచరణ పై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ డి ఓ ఉమారాణి విచ్చేసారు అన్నివిభాగాల అధికారులు,సర్పంచ్ లు,అంగన్వాడీ కార్యకర్తలు, ఎన్,జిఓ లు, ప్రజలు విచ్చేసారు ప్రజా ఆరోగ్య రక్షణ లో భాగంగా.. ఎన్జిఓ రాజశేఖర్,మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల వచ్చే అనారోగ్య సమస్యలను తెలియజేస్తూ,తీసుకోవలసిన తగు జాగ్రత్తలను తెలియజేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బదులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం విచ్చేసిన అధికారుల చేత,ప్రజల చేత ప్లాస్టిక్ నియంత్రణ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.



## నాంచారమ్మ ఆలయంలో క్షుద్ర పూజలు...!?

- ఏఐ యుగంలోనూ మూఢనమ్మకాలు..
- అవగాహన కల్పించని అధికారులు

**వెంకటాపూర్ ఏప్రిల్ 16 (ప్రజాజ్యోతి ):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజాపూర్ గ్రామపంచాయతీ పరిధి ఎరుకల నాంచారమ్మ ఆలయంలో క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కలకలం రేపుతున్నాయి.ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున నాంచారమ్మ జాతర నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో గురువారం అక్కడ ఏర్పాట్లు చేసేందుకు పరిశీలనకు వెళ్ళిన వారు, చుట్టుపక్కల పంట పొలాల రైతులు నాంచారమ్మ ఆలయంగా పిలవబడే పంచ కూటాలయంలో క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు గుర్తించారు.ప్రస్తుతం ఏఐ యుగంలోనూ మూఢనమ్మకాలతో క్షుద్ర పూజలు చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేయడం విస్తుగొలుపుతోంది.అర్ధరాత్రి పూట శ్మశానాలు, రోడ్ల కూడళ్లలో పసుపు, కుంకుమ,నిమ్మకాయలు, జంతు బలులతో చేసిన పూజా ఆనవాళ్లు గ్రామీణ ప్రాంతాలలో స్థానికులను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి.గతంలో నాంచారమ్మ జాతర పరిసరాల్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. మరోసారి జాతరకు ముందు గుప్తనిధుల కోసం పూజలు చేశారా..లేదా క్షుద్ర పూజలు చేశారా అని పలువురు చర్చించుకుంటున్నారు.ఇప్పటికైనా అధికారులు మూఢనమ్మకాలను నిర్మూలించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

>>> మూఢనమ్మకాలను నమ్మకండి

– హెడ్ కానిస్టేబుల్ సంపత్





మూఢనమ్మకాలను నమ్మి మోసపోవద్దని వెంకటాపూర్ హెడ్ కానిస్టేబుల్ సంపత్ అన్నారు.గురువారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజాపూర్ గ్రామ సమీపంలో గల నాంచారమ్మ దేవాలయ ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తులు పూజలు చేశారని అన్నారు.ఇలాంటి పూజల నమ్మి భక్తులు ఎవరు భయపడద్దన్నారు.ఎస్సై చల్ల రాజు ఆదేశానుసారం పరిసరాలను పరీక్షించామని తెలిపారు.రాత్రి జరిగిన సమాచారంపై అక్కడ ఉన్న రైతులను అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట కానిస్టేబుల్ అజయ్, రైతులు,తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కేతిరి బిక్షపతి, సంఘ నాయకులు పాలకుర్తి సురేష్,దేవర్ల పరమేష్ తదితరులున్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీ సంగతేమిటి

- గుర్తింపు లేని తెలంగాణ ఉద్యమకారులు.
- ప్రభుత్వం ఇచ్చిన హామీల సంగతేంటి
- 18 న చలో హైదరాబాదు

**నల్లబెల్లి, ఏప్రిల్ 16(ప్రజా జ్యోతి ):** మలిదశ తెలంగాణ ఉద్యమ పోరాటంలో అలుపెరుగని పోరు చేసిన తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు లేక ఆర్థిక అసమానులతో ఇబ్బందులు పడుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీలలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీ ఏమైందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల సాంబరావు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేసినారు. మండల కేంద్రంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు తంగెళ్ల భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు ఈనెల 18న మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్ తార్నాక హైదరాబాదులో ఉద్యమకారుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఉద్యమకారులందరు ఇట్టి కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికతో పాటు తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులకు మొండి చేయి చూపిస్తే ఎలాంటి కార్యాచరణ రూపొందించాలో ఉద్యమకారుల సమక్షంలోనే నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఉద్యమకారుల అండదండలతో గెలుస్తున్న ప్రభుత్వాలు ఉద్యమకారులకు మొండి చేయి చూపించడం తగదన్నారు. ఇప్పటికైనా జార్ఖండ్ రాష్ట్రం తరహాలో ఉద్యమకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు, ఎకరం భూమి చొప్పున పంపిణీ చేసుకుంటు 250 చదరపు గజాల ఇంటి స్థలం ఇందిరమ్మ ఇల్లు, 25 వేల రూపాయలకు తగ్గకుండా పెన్షన్స్ సౌకర్యం, బస్సు రైలు ఉచిత ప్రయాణం పాసులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు ఆరోగ్య భీమా పథకం వర్తింపజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు ఉద్యమకారుల ఫోరం జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య టఫ్ మండల ఉపాధ్యక్షులు పల్లికొండ రవి. జేఏసీ మండల చైర్మన్ వేముల రాజు, ఖ్యాతం శ్రీనివాస్, ఎన్నమల్ల నరసయ్య, పులి రమేష్ గౌడ్, మేరగుర్తి సమ్మయ్య మండల నాయకులు మామిండ్ల పెద్ద ఐలయ్య, మామిండ్ల చిన్న ఐలయ్య, యన్నమల్ల నర్సయ్య, కొత్తగట్టు ప్రభాకర్, తదితర ఉద్యమకారులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.



# బాలల భవితకు అక్షర దీవెన..

- ఆరోగ్య భారతం కోసం పోషణ ప్రతిజ్ఞ!
- చెన్నారావుపేటలో వైభవంగా పోషణ పక్షోత్సవాలు
- పోషకాహార స్టాల్స్‌ను సందర్శించిన అధికారులు





**చెన్నారావుపేట ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి)**

చిన్నారుల అక్షర క్రతువుకు.. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి వేదికైంది చెన్నారావుపేట రైతు వేదిక. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం మండల కేంద్రంలో పోషణ పక్షోత్సవాలను పండుగలా నిర్వహించారు. అటు పోషకాహారంపై అవగాహన ఇటు చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించే అక్షరాభ్యాస కార్యక్రమాలతో రైతు వేదిక ప్రాంగణం సందడిగా మారింది.

### ››› అక్షరాభ్యాసం చేసిన అధికారులు

కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు విద్యార్థి దశను పరిచయం చేస్తూ స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, ఎంఆర్వో అబిద్ అలీ, ఇంచార్జ్ ఎంపీడీవో ఆయేషా పర్వీన్, పిహెచ్ సి డాక్టర్ సరోజన లు సామూహికంగా అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారుల చేత మొదటి అక్షరాలు దిద్దించి వారిని ఆశీర్వదించారు. అనంతరం అందరితో కలిసి పోషణ ప్రతిజ్ఞ చేయించి ఆరోగ్య నియమాలను వివరించారు.

### ››› ఆకట్టుకున్న న్యూట్రిషన్ స్టాల్స్

మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ ఫుడ్ స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానిక చిరుధాన్యాలు, ఆకుకూరలు మరియు పోషకాలు అధికంగా ఉండే ఆహార పదార్థాల ప్రాముఖ్యతను అధికారులు వివరించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.రాధ, వసంతి, ఐకేపీ వీఓ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు , ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సర్పంచులు, వార్డు మెంబర్లు మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**మహాముత్తారం,ఏప్రిల్ 16. ప్రజాజ్యోతి**మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారము ప్రధానోపాధ్యాయులు చేరి ప్రభాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మరి విధులు నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాసిల్దార్ దండు శ్రీనివాస్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు సురేందర్ రెడ్డి ,డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐత తిరుపతిలు ,హాజరు అయ్యారు. ఈసందర్భంగా తహసీల్దార్ దండు శ్రీనివాస్ సురేందర్ రెడ్డి ,తిరుపతిలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థుల యొక్క క్రమశిక్షణ ను తీర్చిదిద్దడంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల కృషి ఏన లేనిదని కొనియాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలో మీ యొక్క పిల్లలను చదివించాలని వారి భవిష్యత్తుకు మంచి పునాదివేయాలని వారినీ బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలంటే ప్రభుత్వ పాఠశాలలోనే వారిని చదివించాలని కోరారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ప్రభుత్వ పాఠశాలలో నిరంతరము నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆటపాటలతో విద్యార్థులు ఉల్లాసంగా శ్రద్ధతో చదువుతారు. కావున మీరు ఆలోచించిప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లలను చేరిపించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు రామ్ సింగ్, కవిత,అపర్ణ ,అనిల్ ,శారద ,శ్యామల ,కోమలత ,రత్నకుమారి, తిరుపతి, సంపత్ ,మమత, రజిని ,వేణు, ఎం ఆర్ సి సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనలు పాటిద్దాం..సురక్షితంగా గమ్యం చేరుదాం..!

- -పర్వతగిరి సీఐ రాజగోపాల్
- -కాపులకనపర్తిలో వాహనదారులకు రోడ్డు భద్రత పై అవగాహన



**సంగెం,ఏప్రిల్16(ప్రజాజ్యోతి):**మండలంలోని కాపులకనపర్తి గ్రామంలో గురువారం రోజున వాహనదారులకు రోడ్డు భద్రత పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.పర్వతగిరి సీఐ రాజగోపాల్,సంగెం ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ఆటో మరియు ఇతర వాహన డ్రైవర్లను ఉద్దేశించి పోలీసులు ప్రసంగించారు. సీఐ రాజగోపాల్ మాట్లాడుతూ.. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నియమ నిబంధనలను విధిగా పాటించాల ని సూచించారు.ప్రధానంగా ఈ క్రింది అంశాల పై డ్రైవర్లకు దిశానిర్దేశం చేశారు.

### ››› సెల్ ఫోన్ వినియోగం:

వాహనం నడుపుతూ సెల్ ఫోన్ మాట్లాడటం వల్ల ఏకాగ్రత దెబ్బతిని ప్రమాదాలు జరుగుతున్నాయని,దీనిని పూర్తిగా నివారించాలని కోరారు.

### ››› అధిక లోడింగ్:

ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్ల వాహనం నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉందని,ఇది ప్రయాణికుల ప్రాణాలకు ముప్పని హెచ్చరించారు.

### ››› నిబంధనల పాటన:

ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని,వాహనానికి ఇన్సూరెన్స్ ఉండాలని మరియు డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలని స్పష్టం చేశారు.

### ››› మద్యం సేవించి డ్రైవింగ్:

మద్యం సేవించి వాహనం నడపడం నేరమని,దీనివల్ల అమాయకుల ప్రాణాలు బలి అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు.కొంతమంది డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.సరైన పత్రాలు లేని వాహనాలకు,నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై వంశీకృష్ణతో పాటు పోలీస్ సిబ్బంది మరియు వాహనదారులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎర్రబెల్లి



**పాలకుర్తి ఏప్రిల్16/ ప్రజా జ్యోతి /** మండల కేంద్రం లోని శ్రీ మహాలక్ష్మి డెకరేషన్, టెంట్ హౌస్ రేపాల అశోక్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దయాకర్ రావు మాట్లాడుతూ పట్టణ కేంద్రానికి వచ్చే కూలీలు, వ్యాపారస్తులు, ప్రయాణికులు ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్నారని వారి దాహాన్ని తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేస్తూ గత కొన్ని సంవత్సరాలు నుండి ప్రజలకు చల్లటి నీరు అందిస్తున్న రేపాల అశోక్ ను శాలువాతో సత్క రించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్య క్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పసునూరి.నవీన్ కుమార్, మాజీ జడ్పిటీసీ పుస్కూరి.శ్రీనివాస రావు, మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న, ఉప సర్పంచ్ గాదేపాక.కిరణ్ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## గ్రామప్రజల సంక్షేమమే లక్ష్యం గుడికుంట తండా సర్పంచ్ మహేందర్ నాయక్



**పాలకుర్తి ఏప్రిల్ 16/ ప్రజా జ్యోతి /** గ్రామ పంచాయితీ ఎన్నికలలో నాకు సహకరించి సర్పంచ్ గా ఎన్నుకున్నా న గ్రామ ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమని వాహనాలపై ప్రయాణించే వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా క్షేమంగా ఇంటికి రావడానికి హెల్మెట్లు ధరించాలని గురువారం సర్పంచ్ మహేందర్ నాయక్ గ్రామ ప్రజలకు 50 హెల్మెంట్లు పంచడం జరిగిందని తెలిపారు. గ్రామ అభివృద్ధికి గ్రామ ప్రజలందరూ నాతో సహకరించాలని కోరారు. హెల్మెట్ పంపిణీ కార్యక్రమంలో టూ వీలర్ వాహనదారులు నాయకు లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## “ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక”పై సమీక్షా సమావేశం



**మంగపేట ప్రజాజ్యోతి ఏప్రిల్ 16**ప్రజాజ్యోతిరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ‘ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక’ కార్యాచరణ లో భాగంగా మంగపేట మండల కేంద్రం లోని రైతు వేదిక లో గురువారం ఎంపిడిఓ బద్రునాయక్ అధ్వర్యంలో ‘ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక’పై సమీక్షా సమావేశం ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ప్రత్యేక అధికారి కె.వెంకయ్య హాజరై 99 రోజుల ‘ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక’పై పలు శాఖల మండల అధికారులకు సమన్వయంతో పనిచేయాలని పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రస్తుత పథకాలతో పాటు, భవిష్యత్తులో ప్రవేశ పెట్టబోయే నూతన పథకాలపై గ్రామస్థులకు సమగ్రంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశానికి పలు శాఖలకు చెందిన మండల అధికారులు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థిని బాల లక్షయ చిత్రపటానికి నివాళ్లు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**రాయపర్తి ఏప్రిల్ 16 ప్రజా జ్యోతి**వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురాన్ పల్లి గ్రామంలోగురువారంఇంటర్ విద్యార్థిని బాల లక్షయ ఇటీవల మనస్తపంతో ఆత్మహత్య చేసుకొని మరణించగా, ఈ రోజు వారి చిత్రపటానికి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

# దళిత హక్కుల పోరాట సమితి 2 వ మహాసభలను విజయవంతం చేయాలి




**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 16** దళిత హక్కుల పోరాట సమితి 2 వ మహాసభలను విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రాసపల్లి భద్రయ్య విజ్ఞప్తి చేశారు.గురువారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 17 18 తేదీల్లో వరంగల్ అబ్బూస్ ఫంక్షన్ హాల్ పోచం మైదాన్ జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భద్రయ్య అన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుదాం సామాజిక న్యాయానికై పోరాడుదాం ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలుపై పోరాడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్ 2వార్డు సభ్యులు అంబేద్కర్ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులు తిక్క సంపత్ ఎడ్ల సదానందం రెంటాల రవి ఇనుగాల సాంబయ్య యాకూబ్ షరీఫ్ బండారు రాజయ్య భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాల్య తండలో మక్కల గోదాం ప్రారంభం

- - రైతులకు ఊరటనిచ్చే చర్య..



**పర్వతగిరి, ఏప్రిల్ 16 (ప్రజాజ్యోతి )** పర్వతగిరి మండలం మాల్య తండ గ్రామ పంచాయతీ పరిధిలో 3 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల మక్కల గోదాంను గురువారం సర్పంచ్ భూక్యా మంజుల శ్రీనివాస్ నాయక్ ప్రారంభించారు. మక్కల నిల్వ కోసం ఈ గోదాంను కేటాయించడం రైతులకు ఎంతో ఉపయోగకరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. ఏనుగల్లు ప్రాంతంలో కొనుగోలు చేసిన మక్కలు నేరుగా మాల్య తండ గోదాంకు చేరుతున్నాయని, దీనివల్ల రైతుల రవాణా సమస్యలు తగ్గి, వారికి ఉపశమనం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోత్ నర్సింహా, వార్డు సభ్యులు భూక్యా శ్రీను, భూక్యా చిన్న, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆము, నాయకులు బానోత్ రవి, హమాలీలు పాల్గొన్నారు.

# హర్జా నాయక్ మృతదేహానికి పూల మాలవేసి నివాళులర్పించిన చెన్నారావుపేట పాత్రికేయుల బృందం....



**చెన్నారావుపేట ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి )** మండల కేంద్రంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన మెట్రో ఈవినింగ్ న్యూస్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జాటోత్ యాకూబ్ నాయక్ తండ్రి హర్జనాయక్, అనారోగ్యంతో గురువారం మృతి చెందిన విషయం తెలుసుకునీ మండల పాత్రికేయుల బృందం కలిసి పాపయ్యపేట గ్రామానికి చేరుకొని హజ్జా నాయక్ మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు మన్నెం వీరేందర్ రెడ్డి, మండల ప్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ సుభాన్, చెలుకలపెల్లి రాజు,కూస సుదర్శన్, మల్లాడి వీరారెడ్డి, బేతి రజాకర్, సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి, రాజేందర్, గూడెపు అమరేందర్,రమేష్, నిజాముద్దీన్ తదితర పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

# రాజ్యసభలో అడుగుపెట్టిన వేం నరేందర్ రెడ్డి

- ఉమ్మడి వరంగల్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకుల అభినందనలు వెల్లువ



**వరంగల్, ఏప్రిల్ 16(ప్రజాజ్యోతి):** రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. గురువారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఆయనను శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, డాక్టర్ మురళి నాయక్ తదితరులు హాజరై అభినందనలు తెలియజేశారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించడం జిల్లాకు గౌరవకరమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# సికెఎం డిగ్రీ కళాశాలలో పుస్తక ప్రదర్శన

- 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా నిర్వహణ



**వరంగల్ సిటీ, ఏప్రిల్ 16(ప్రజాజ్యోతి):** నగరంలోని దేశాయిపేట లో గల సికెఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, సిబ్బందికి పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. ధర్మారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా గ్రంథాలయంలో లభ్యమయ్యే వివిధ రకాల పుస్తకాలను ఉపయోగించుకుని విజ్ఞానాన్ని విస్తరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు గ్రంథాలయ వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఇలాంటి పుస్తక ప్రదర్శనలు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పుస్తక ప్రదర్శనలో వివిధ విభాగాలకు సంబంధించిన పాఠ్య, సూచిక, పోటీ పరీక్షల పుస్తకాలు ప్రదర్శనకు ఉంచగా విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన గ్రంథపాలకుడు ఎస్. అనిల్ కుమార్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. కె.ఎల్.వి. వరప్రసాద్ రావు, అకడమిక్ కోఆర్డినేటర్ డా. బి. విజయపాల్ రెడ్డి, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డా. సతీష్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతులకు లారీలు రాక రైతుల ఇబ్బందులు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు


**పాలకుర్తి ఏప్రిల్16/ ప్రజా జ్యోతి /** మొక్కజొన్న పండించిన రైతులు లారీలు రాక రైతులు మండుటెండలో ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రం లోని చాకలి ఐలమ్మ మార్కెట్ యార్డులో మక్కలు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యంతో మొక్కలు కొనుగోలు కేంద్రాలలో ఆలస్యం జరుగుతుందని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి దొంగ హామీలతో ప్రజలను మోసం చేశారని తెలిపారు. రైతులకు రైతుబంధు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని, రైతులకు బోనాల



సిస్తానని ఇవ్వలేదని తెలిపారు. రైతులకు 24 గంటలకరెంటుఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏడు గంటలు కరెంటు ఇస్తున్నారని తెలిపారు. రైతులను ప్రజలను మోసం చేసే నాయకులు ప్రజల మధ్య నిల్వరని అన్నారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పసునూరి నవీన్, శ్రీనివాసరావు, నాగిరెడ్డి, కర్ణాకర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కులగణన సర్వే తప్పులతడక

- - అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి రాము



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్రంలో గాండ్ల కులదేవ తెలికుల బిసి–బి కులస్తులు రెండు లక్షలకు మించి ఉన్నారని,కాని నిన్న విడుదల చేసిన సమాచార మంత్రిత్వ శాఖ విడుదల చేసిన దానిలో గాండ్ల కులస్తులు కేవలం 54,000 మంది ఉన్నారని తప్పుడు సర్వే రిపోర్టు పంపించడం గాండ్ల కులస్తులను అవమానించడమేనని అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి రాము ఆరోపించారు.సుమారు రెండు లక్షల పైచిలుకు గల గాండ్ల కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని,గతంలో బిసి కమిషన్ 33 జిల్లాలలో పర్యటించిన సందర్భంలో ప్రతి జిల్లాలో గాండ్ల కులస్తులు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. వెనుకబడిన మైనారిటీలో ఉన్న బిసిలను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయంగా ఉండాలని,కాని ఉన్న బిసిలను అవమానించే విధంగా రిపోర్ట్ తయారు చేయడం అన్యాయమని అన్నారు.బీసిలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించి నిలదీయాలంటే ఇప్పటికైనా బీసీలంతా ఏకమై కార్యాచరణ రూపొందించాలని అన్నారు. మాకే కాకుండా ఇతర బీసీ మైనారిటీ కులస్తులకు ఇదే విధంగా తక్కువ జనాభా చూపించే విధంగా రిపోర్ట్ తయారు చేయడం జరిగిందని,ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి సరియైన బీసీ జనాభా లెక్కలను రూపొందించాలని లేనిచో గాండ్ల కులస్తులతో రాష్ట్ర రాజధానిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రభుత్వానికి తెలిసేలా సభ రూపొందించడం జరుగు తుందని హెచ్చరించారు.

# ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డికి ఎమ్మెల్యే నాగరాజు శుభాకాంక్షలు



**వర్ధన్నపేట, ఏప్రిల్ 16, ప్రజా జ్యోతి.** తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన శ్రీ వేం నరేందర్ రెడ్డి గురువారం ఢిల్లీ పార్లమెంట్ రాజ్యసభ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి , మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, ఎంపీలు, ఎమ్మెల్సీలు మరియు సహచర ఎమ్మెల్యేలతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి మరియు ప్రజల ఆశయాల సాధనలో రాజ్యసభ సభ్యునిగా వేం నరేందర్ రెడ్డి సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. అలాగే, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ శ్రీ నిమ్మాని శేఖర్ రావు కూడా వేం నరేందర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు మాట్లాడుతూ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని, రాజ్యసభ వేదికగా రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పర్వతగిరిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం









- **అభివృద్ధి వేగవంతానికి అధికారుల పిలుపు**

**పర్వతగిరి, ఏప్రిల్ 16 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి మండలంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వేదికలో మండల స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో గత 2 సంవత్సరాల 3 నెలల కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను శాఖల వారీగా అధికారుల ద్వారా వివరించడం జరిగింది. సమావేశాన్ని రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ తో ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి ఉచిత విద్యుత్, సన్న రకం వరికి బోనస్, చేయూత పింఛన్లు, కల్యాణ లక్ష్మి / షాదీ ముబారక్, స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాల ద్వారా లబ్ధిదారులు పొందిన ప్రయోజనాలను వివరించారు. అలాగే రాబోయే రోజుల్లో ప్రభుత్వం అమలు చేయనున్న అల్పాహార పథకం (ప్రీ–ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు), ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ వరకు విస్తరణ, ఇంటర్మీడియట్ చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు మోటారు వాహనాల పంపిణీ, పంటల వైవిధ్యం మరియు ప్రకృతి సేంద్రియ వ్యవసాయం వంటి అంశాలపై కూడా అధికారులు వివరంగా తెలియజేశారు.

**››› వివిధ శాఖల అధికారుల సూచనలు:**

వ్యవసాయ శాఖ అధికారులు: రైతులు సకాలంలో పంటల నమోదు చేయించుకోవాలని, రైతు భరోసా వంటి పథకాల ప్రయోజనాలు పొందేందుకు అర్హత ప్రమాణాలను పాటించాలని సూచించారు. పంటలకు తగిన ఎరువులు, విత్తనాల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

**రెవెన్యూ శాఖ అధికారులు:** భూమి సంబంధిత సమస్యలు ఉన్నవారు మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు సమర్పించాలని, రికార్డుల సవరణలకు ముందుకు రావాలని సూచించారు.

**పంచాయతీ రాజ్ శాఖ అధికారులు:** గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపర్చాలని, చెత్త నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని చెప్పారు.

**విద్యుత్ శాఖ అధికారులు:** గృహజ్యోతి పథకం కింద అర్హులైన వారు నమోదు చేసుకోవాలని, విద్యుత్ వినియోగాన్ని ఆదా చేయాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం అధికారులు: గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

**ఆరోగ్య శాఖ అధికారులు:** గ్రామాల్లో ఆరోగ్య సేవలను వినియోగించుకోవాలని, టీకాలు, గర్భిణీ స్త్రీల పర్యవేక్షణ వంటి కార్యక్రమాల్లో ప్రజలు సహకరించాలని కోరారు.

**సమగ్ర శిశు అభివృద్ధి (ఐసీ డిఎస్) శాఖ:** గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు అంగన్వాడీ సేవలను వినియోగించుకోవాలని, పోషకాహారంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు.

సివిల్ సప్లై అధికారి మాట్లాడుతూ మండలంలో పర్వతగిరి గ్రామంతో పాటు కొన్ని ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ల కొరత ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని సివిల్ సప్లై అధికారి తెలిపారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు గ్యాస్ ఏజెన్సీలతో సమన్వయం చేస్తున్నామని చెప్పారు.లబ్ధిదారులు గ్యాస్ బుకింగ్‌ను ముందుగానే చేసుకోవాలని, సరఫరాలో ఆలస్యం జరిగితే సంబంధిత డీలర్లకు లేదా అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉజ్వల పథకం కింద గ్యాస్ సదుపాయం పొందిన వారు కూడా సరైన విధంగా వినియోగించుకోవాలని తెలిపారు.అక్రమంగా సిలిండర్ల నిల్వ, బ్లాక్ మార్కెట్ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి అర్హుడికి సమయానికి గ్యాస్ అందేలా చర్యలు చేపడుతున్నామని సివిల్ సప్లై అధికారి స్పష్టం చేశారు. ఈ సూచనలను గ్రామ స్థాయిలో అమలు చేస్తే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరుతాయని అధికారులు తెలిపారు.

మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ:మండలంలో సమగ్ర అభివృద్ధికి ఆరోగ్య భద్రత, రోడ్డు భద్రత, వ్యవసాయ భద్రత అత్యంత ముఖ్యమని మండల ప్రత్యేక అధికారి పేర్కొన్నారు.ఆరోగ్య భద్రత విషయంలో గ్రామస్థులు ప్రభుత్వ ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, టీకాలు, గర్భిణీ స్త్రీల పర్యవేక్షణ, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వ్యాధుల నివారణకు పరిశుభ్రత పాటించడం అత్యవసరమని చెప్పారు.రోడ్డు భద్రత పరంగా వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్,సీట్ బెల్ట్ వినియోగించుకోవాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు.వ్యవసాయ భద్రతపై మాట్లాడుతూ రైతులు పంటలకు సరైన పద్ధతులు అనుసరించడంతో పాటు, రసాయనాల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంటల బీమా, ఆధునిక సాగు విధానాలను అనుసరించడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు.ఈ మూడు రంగాల్లో ప్రజల అవగాహన పెరిగితేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని మండల ప్రత్యేక అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ కిష్టయ్య గారు, మండల ప్రత్యేక అధికారి రవి శంకర్ గారు, ఎంపీడీఓ శంకర్ నాయక్ గారు, ఎమ్మార్ఓ వెంకట స్వామి గారు, ఎస్సై ప్రవీణ్ గారు, ఎంపీవో శేషు, మెడికల్ ఆఫీసర్, ఎంఈఓ, ఏఓ ప్రశాంత్, ఏపీఓ సుశీల్, ఏపీఎం రాజీర్, విద్యుత్ శాఖ అధికారులు, గౌరవ సర్పంచులు, అంగన్వాడీ సూపర్వైజర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు మరియు గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు

- **మండల స్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక – మండల సభ**
- **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 16 (ప్రజాజ్యోతి):** 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లాలోని రఘునాథపల్లి మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా రాష్ట్ర గీతాన్ని ఆలపించి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు. రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను మండల ప్రజలకు తెలియజేశారు. నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం – ఇంటర్మీడియట్ కు విస్తరణ, విభిన్న ప్రతిభావంత ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాలపై అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో వివిధ పథకాల లబ్ధిదారులు తమకు అందిన ప్రయోజనాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల తమ సమస్యలు పరిష్కారమవుతున్నాయని సంతోషాన్ని పంచుకున్నారు.ప్రజల సమస్యలను కలెక్టర్ ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రతీ గడప కి అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జనగామ జిల్లా రాష్ట్ర స్థాయిలో టాప్–2లో నిలవడం గర్వకారణమని తెలిపారు. దీని కోసం ఇంజనీరింగ్ అధికారులు, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు సమర్థంగా పని చేయడం ముఖ్య కారణమని అభినందించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల విషయంలో పెండింగ్ లో ఉన్న ఇళ్లను కూడా వేగవంతంగా పూర్తి చేసి, గృహ ప్రవేశాలు చేసే విధంగా లబ్ధిదారులకు సర్పంచులు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఇసుక తరలింపుకి సంబంధించి పారదర్శకంగా ఆన్లైన్ ద్వారా సరఫరా చేయడం జరుగుతోందని వివరించారు. రేషన్ కార్డుల దరఖాస్తు, మంజూరు నిరంతర ప్రక్రియ అని, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. మండల సభలో ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మారుజోడు రాంబాబు, గృహ నిర్మాణ పీడీ మాతృ నాయక్, మండల ప్రత్యేక అధికారి కోదండరాములు, ఎంపిడిఓ శ్రీనివాసులు, తహసీల్దార్ రాజేష్, సర్పంచులు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, మండల ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణకు ఏఎల్ఎంఎస్ కమిటీల చొరవ అవసరం

- **గ్రామస్థాయిలో బాలల హక్కుల పరిరక్షణకు గ్రామ బాలల పరిరక్షణ కమిటీలదే బాధ్యత**
- **ఐసీడీఎస్ సూపర్వైజర్ పుష్పావతి**

**కన్నాయిగూడెం, ఏప్రిల్ 16( ప్రజాజ్యోతి ):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల ప్రత్యేక కార్యాచరణ )లో భాగంగా గురువారం కన్నాయిగూడెం కేంద్రంలోని రైతువేదికలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల అభివృద్ధి అధికారి శ్రీమతి సాజిదా బేగం అధ్యక్షత వహించగా, మండల తహశీల్దార్ సర్వర్, వ్యవసాయ అధికారి మహేష్, విద్యా శాఖాధికారి సాంబశివరావు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ పుష్పావతి మాట్లాడుతూ, ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. గ్రామస్థాయిలో అంగన్వాడీ స్థాయి మానిటరింగ్ కమిటీ (ఏఎల్ఎంఎస్) ఛైర్మన్గా సర్పంచులు అంగన్వాడీ కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అలాగే పోషకాహార లోపంతో బాధపడుతున్న ఎస్ఏఎం, ఎమ్ఏఎం పిల్లలను సాధారణ స్థితికి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు తీసుకొని, పోషకాహార లోపం లేని మండలంగా కన్నాయిగూడెంను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుండి పరిరక్షణ అధికారి ఎన్. హరికృష్ణ మాట్లాడుతూ, గ్రామస్థాయిలో బాలల సమస్యల పరిష్కారానికి గ్రామ బాలల పరిరక్షణ కమిటీ (వీసీపీసీ) కీలకమని తెలిపారు. ఈ కమిటీలో సర్పంచ్ ఛైర్మన్గా, అంగన్వాడీ టీచర్ కన్వీనర్గా, వివిధ వర్గాల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. ప్రతి నెలా ఈ కమిటీ సమావేశాలు నిర్వహించి బాల్య వివాహాలు నివారించడం, బాలలపై వేధింపులు లేకుండా చూడడం, బాల కార్మిక వ్యవస్థను అరికట్టడం, ముఖ్యంగా పిల్లలు చదువు మానకుండా పాఠశాలలకు వెళ్లేలా చూడడం ద్వారా గ్రామాలను బాలలకు అనుకూలంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బంది, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రతినిధి బి. రాజు తదితరులు పాల్గొన్నారు.

